క్లుప్తంగా

ఎరిగేరి సచివాలయం తనిఖీ



సచివాలయ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: మండలంలోని ఎరిగేరి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ సుబ్బరాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి మాట్లాడుతూ గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను గుర్తించి నమోదు చేయించాలని ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి భోజనం తీరును తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న నూతన సచివాలయ భవనాన్ని మండల అధికారులతో కలసి పరిశీలించారు. సర్పంచ్ గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శి మోగేశ్వరెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కౌతాళం: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని బదినేహల్ గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్, సర్పంచ్ నర్సయ్య, ఉప సర్పంచ్ ప్రసన్న గౌడ్ అన్నారు. మండలంలోని బదినేహల్ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీలకు మండలంలోని 14 పాఠశాలలకు చెందిన సుమారు 1400 మంది పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి

ఆదోనిరూరల్ : గణేష్ ఉత్సవాలను ప్రజలందరూ శాంతియుతంగా జరుపుకోవాలని తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పీరయ్య ఆధ్వర్యంలో ఉత్సవకమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కౌతాళంలో పిచ్చి కుక్క స్వైరవిహారం



పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారి

కౌతాళం: స్థానిక హనుమాన్ నగర్‌లో శుక్రవారం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి కాలనీకి చెందిన నలుగురిని గాయపరిచింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కాలనీలో పిచ్చికుక్క శివనా గప్పను గాయపరచగా కాలనీవాసులు బంధించేలోపు వడ్డే మణిశంకర్, కురువ ఈరన్న, అక్షయ, పంపన్న చిన్నారులను కరిచి గాయపరిచింది. కుక్క కాటుకు గురైన వారంతా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు.

బస్సు ఢీ కొని యువకుడికి గాయాలు

ఆదోనిఅర్బన్ : పట్టణ శివారులోని ఆస్పరి రోడ్డులో బస్సు ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలపాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. స్థానిక ఎంఐజీ కాలనీకి చెందిన రాకేష్ అనే యువకుడు బైకుపై వెళ్తుండగా బస్సు ఢీకొట్టడంతో గాయాలయ్యాయన్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో క్షతగాత్రుడిని వైద్యులు కర్నూలుకు రెఫర్ చేసినట్లు చెప్పారు.

పౌరసరఫరాల పంపిణీపై విచారణ



విచారణ చేపడుతున్న కేంద్ర, రాష్ట్ర బృందాలు

ఆదోనిరూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బియ్యం, ఇతర రేషన్ సరుకులు సక్రమంగా కార్డుదారులకు అందుతున్నాయా లేదా అని శుక్రవారం కేంద్ర, రాష్ట్ర బృందాలు తనిఖీ చేపట్టాయి. పట్టణంలోని 39వ రేషన్ షాపులో తనిఖీలు చేసి, కార్డుదారులను పిలిపించి నిత్యావసర సరుకుల పంపిణీపై ఆరా తీయగా, తమకు అందుతున్నాయని లబ్ధిదారులు వారికి సమాధానమిచ్చారు. కార్డుదారులతో సంతకాలు చేయించుకుని వెళ్లిపోయారు. తనిఖీలో ప్రొఫెసర్ జి.ఎస్.శర్మ, డీఎస్ఓ ఆచారి, ఏఎస్ఓ రామాంజనేయరెడ్డి, సీఎస్‌డీటీ నవీన్‌కుమార్, మంగీలాల్, ఆదోని సీఎస్‌డీటీ వలీబాషా, వీఆర్వోలు నయోమి, రాజేశ్వరి ఉన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యసేవల పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ఆదోనిరూరల్ : ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేందుకు వైద్యరంగానికి పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్వీ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జగ నన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటికీ తిరిగి ప్రజల వ్యాధులను గుర్తించి గ్రామాల్లోనే నిపుణులైన వైద్యులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందజేయనుండటం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందే సేవలను ప్రజలకు తెలియజేస్తూ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జెడ్పీటీసీ అరుణమ్మ, ఎంపీపీ దానమ్మ, ఎంపీడీఓ గీతావాణి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, పెద్ద హరివాణం పీహెచ్‌సీ వైద్యుడు ఇమ్రాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగపు కార్యదర్శి గోపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆనంద్, రామలింగేశ్వరయాదవ్, పరిగల నారాయణ, సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపీటీసీ సరస్వతి, వైస్ సర్పంచ్ నాగప్ప, ఆరికాళప్ప, భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి, దూద్‌బాషా పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకే బాబు జైలుకు..

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందునే చంద్రబాబునాయుడు జైలుకు వెళ్లాడని ఎమ్మెల్యే అన్నారు. ఎంతటివారైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించక తప్పదన్నారు. చంద్రబాబునాయుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎప్పుడో జైలుకు వెళ్లాల్సిన బాబు స్టేలు తెచ్చుకుని ముందుకెళ్తున్నాడన్నారు. తాజాగా పవన్‌కళ్యాణ్‌తో జతకలిసి పొత్తుల పేరుతో జగన్‌మోహన్‌రెడ్డిని ఓడిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని, వీరిని జనం నమ్మరన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



లబ్ధిదారులకు కొత్త పింఛన్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్‌ను అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్‌లను ఆయన శుక్రవారం తన నివాసంలో పంపిణీ చేశారు. పట్టణంలో కొత్తగా 453 పింఛన్‌లు మంజూరు కాగా, ఇందులో 17వ వార్డుకు 17 పింఛన్‌లు, 18వ వార్డుకు 24, 19వ వార్డుకు 29 వచ్చాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణానికి 453 కొత్త పింఛన్‌లు మంజూరయ్యాయని, వాటిని లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు. మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, 17, 18, 19వ వార్డు కౌన్సిలర్‌లు చిన్నా, చలపతి, మధు పాల్గొన్నారు.

తప్పు చేసినందుకే చంద్రబాబు తంటాలు



నూతన పింఛన్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అవినీతికి పాల్పడినందుకే టీడీపీ నేత చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సభలో ఆయన ప్రసంగిస్తూ తప్పును కప్పిపుచ్చుకునేందుకు నెపాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నెట్టడం హాస్యాస్పదమన్నారు. కేసులో ఇరికించాలంటే ఇన్ని రోజులు ఆగాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర అవినీతి నిరోధక శాఖల తనిఖీల్లో బాబు భాగోతం బయటపడిందన్నారు. భయంతో చంద్రబాబు జనసేనతో చేతులు కలిపారని, దత్తపుత్రుడితో ఒరిగేది శూన్యమన్నారు. ప్రజల ఆశీస్సులు ఉన్నంత కాలం వైఎస్సార్‌సీపీని ఎవరూ ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా, నాటకాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. స్థానిక టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒక్కచాన్స్ అంటూ కొత్త అవతారం ఎత్తారని మండిపడ్డారు. గతంలో 5,710 పింఛన్లు వస్తుండగా మండలానికి ప్రస్తుతం అదనంగా 1,420 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమరెడ్డి, వ్యవసాయ మండలి సలహా కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు గోవిందమ్మ, ఎంపీడీఓ మణిమంజరి, ఈఓపీఆర్‌డీ ప్రభావతి, ఎస్ఐ కిరణ్‌బాబు, నాయకులు మల్లికార్జున, పరమేష్, శివకుమార్, గోరుకల్లు కృష్ణస్వామి పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి శుక్రవారం మాధవరం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ రిజిస్టర్లను పరిశీలించి పనితీరుపై ఆరా తీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో పర్యటించారు. వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి వసతి పనులను పరిశీలించారు. త్వరలోనే కాలనీలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

జాహ్నవి మృతిపై అమెరికా పోలీసుల తీరు సరికాదు

ఆదోనిరూరల్ : జాహ్నవి మృతిపై అమెరికా పోలీసుల తీరును పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి సోమశేఖర్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్ ఖండించారు. శుక్రవారం రాత్రి స్థానిక తిక్కస్వామి దర్గా ఐఎఫ్‌టీయూ కార్యాలయం నుంచి ఎమ్మిగనూరు టర్నింగ్ వరకు జాహ్నవి మృతిపై సంతాపం తెలియజేస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదోనికి చెందిన జాహ్నవి అమెరికాలో ఎంఎస్ చదువుతోందన్నారు. జాహ్నవి రోడ్డుపై నడుస్తుండగా పోలీస్ వాహనం ఢీకొట్టడంతో మృతి చెందింది. అయితే వాహనంలోని పోలీసు అధికారి ఆమె మృతిని తేలిక తీసిపారేశాడు. ఆమె ప్రాణాల పట్ల ఎగతాళి చేయడం దారుణమన్నారు. ఇంద్రకరణ్, ఉపేంద్ర, మహేష్, రాఘవేంద్ర, జాన్, సాగర్, కృష్ణ, విద్యార్థినులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో సంతాపం వ్యక్తం చేస్తున్న దృశ్యం

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

మంత్రాలయం : ఆదోని పట్టణం గణేష్ సర్కిల్‌లో నివాసముంటున్న మాది గుండు లక్ష్మీదేవమ్మ(74) కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకోబోగా పోలీసులు కాపాడారు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. మాది గుండు ఈరన్న భార్య లక్ష్మీదేవమ్మకు ఇద్దరు కుమారులు. ఆస్తి పంపకాలు, ఆర్థిక వివాదాల్లో భాగంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మీదేవమ్మ రెండు రోజుల క్రితం మంత్రాలయం వచ్చి భిక్షాటన చేసుకుంటూ గడిపింది. శుక్రవారం తుంగభద్ర నదిలో చీరతో గొంతుకు చుట్టుకుని బలవన్మరణానికి యత్నించింది. స్థానికుల సమాచారంతో ఎస్ఐ సిబ్బందిని పంపి ఆమెను స్థానిక మఠం ఆసుపత్రికి తరలించారు. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో 108 అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాణాపాయం తప్పింది. రాత్రి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రాణాలను రక్షించిన కానిస్టేబుళ్లు కృష్ణ, కోదండరామిరెడ్డి, సురేంద్రను ఎస్ఐ అభినందించారు.



వృద్ధురాలిని చికిత్సకు తరలిస్తున్న పోలీసులు

నేడు తాగునీటి పథకాల ప్రారంభం

కోసిగి: మండల కేంద్రంలో శనివారం తాగునీటి పథకాలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.18 లక్షలతో రంగప్ప గట్టు రోడ్డు నుంచి కోసిగి వరకు ఏర్పాటు చేసిన, అలాగే 9వ వార్డులోని భీరప్ప గుడి కాలనీలో రూ.4లక్షలతో పైప్‌లైన్‌ను ప్రారంభించనున్నారని చెప్పారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మండలానికి కొత్తగా మంజూరైన 299 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం

ఆదోనిరూరల్ : 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో బహిరంగ విచారణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతావాణి శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 37 పంచాయతీల్లో జరిగిన 1,475 పనులకు వేతనాలు రూ.12,51,14,797, మెటీరియల్ పనులకు చెల్లింపు రూ.34,90,551, పీఆర్ డిపార్ట్‌మెంట్ కాన్వర్జెన్స్ పనులు పనుల సంఖ్య 73, మెటీరియల్ కోసం రూ.43,76,1761 చెల్లించారన్నారు. వీటిపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేపట్టిందన్నారు. ఆ నివేదికలపై శనివారం బహిరంగ విచారణ ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని 132కేవీ నిర్వహణ, మరమ్మతులు ఉండడంలో పట్టణం, ఆదోని మండలం, కౌతాళం మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని 132 కేవీ ఏడీఈ చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

20న డిగ్రీ తరగతులు ప్రారంభం

ఆదోని సెంట్రల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ శివారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని చెప్పారు. నూతన కాలేజీలో అన్ని రకాల వసతులు సమకూర్చుతున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–14, 17 విద్యార్థులకు మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సహకారంతో మండల కేంద్రంలో రూ.4.30 కోట్లతో సువిశాల మైదానంతో కూడిన ఉన్నత పాఠశాలను నిర్మించామన్నారు. అంతకు ముందు పాఠశాల కోసం ప్రత్యేక తాగునీటి వసతిని ప్రారంభించారు. సభలో విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమరెడ్డి, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గోవిందమ్మ, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, నాయకులు మల్లికార్జున, జనార్ధన్‌రెడ్డి, శివకుమార్, ఎంఈవోలు మొయినుద్దీన్, రాఘన్న, హెచ్ఎం అంపయ్య, పీఈటీలు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్ : భీమా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్‌డే వేడుకలను కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

ఆదోనిఅర్బన్ : ఆర్యవైశ్య అఫీషియల్స్ మరియు ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా), ఆవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్‌డేను శుక్రవారం పట్టణంలోని శ్రీ నగరేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజనీర్లు ద్వారకానాథ్, ప్రణీత్, కిరణ్, సత్యనారాయణ, మణిరాజును ఘనంగా సన్మానించారు. పట్టణ ఆవోపా అధ్యక్షుడు వంకదారి శ్రీనాథ్‌గుప్తా, కార్యదర్శి మిర్యాల శ్రీధర్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్‌డే జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రకాష్, వేణు, విట్టా రాధిక, మిరియాల, సరస్వతి పాల్గొన్నారు.



సివిల్ ఇంజినీర్లను సన్మానిస్తున్న ఆవోపా సభ్యులు

సస్యరక్షణతో 'గులాబీ' నివారణ



రైతులకు మందులు అందజేస్తున్న అధికారులు

ఆదోనిరూరల్ : పత్తిలో గులాబీరంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ప్రిన్సిపల్ సైంటిస్టు రమేష్ నాయక్, లక్ష్మణ్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఢణాపురం గ్రామంలో జాగృతి ప్రాజెక్టులో భాగంగా రైతులకు పత్తిలో గులాబీరంగు పురుగు యాజమాన్యం గురించి వివరించారు. విత్తిన 45 రోజుల నుంచి గులాబీరంగు పురుగు ఉనికిని గమనించడానికి లింగాకర్షక బుట్టలు అమర్చి వరుసగా మూడు రోజులు బుట్టలో 8 తల్లిరెక్కల పురుగులు పడితే. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. వ్యవసాయ అధికారి అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ హనుమయ్య, సర్పంచ్ అంజినయ్య, భాస్కర్ రెడ్డి, తిమ్మారెడ్డి, ఎల్‌డీసీ కంపెనీ ప్రతినిధి ఉపేంద్రారెడ్డి, బేయర్ క్రాఫ్ సైన్స్ కంపెనీ రీజనల్ మేనేజర్ సంతోష్ పాల్గొన్నారు.

వర్గీకరణ చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తాం

కోసిగి: ఎస్సీ వర్గీకరణ సాధించేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఎంఎస్‌పీ జిల్లా కో కన్వీనర్ చిన్నదుర్గప్ప మాదిగ, మంత్రాలయం తాలుకా కన్వీనర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు చింతకుంట సామేల్ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ కేంద్ర, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22వ తేది వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను బీజేపీ నిలుబెట్టుకోవాలన్నారు. వర్గీకరణ చేపట్టకపోతే రానున్న ఎన్నికల్లో బీజేపీ భరతం పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ కోకన్వీనర్ ఈరన్న, ప్రకాష్, నరసింహులు, మండల సీనియర్ నాయకులు ఉరుకుందు, రంగన్న, యల్లప్ప, వెంకటరమణ నరసింహులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై విచారణ

హొళగుంద: స్థానిక పాత సిద్ధేశ్వర రైస్ మిల్ వెనుక కొండపై జరిగిన ఆక్రమణలపై శుక్రవారం తహసీల్దారు హుసేన్‌సాహేబ్, ఆర్ఐ దినోజ్ విచారణ చేపట్టారు. కొండపై సర్వే నంబరు 557/1 లో 13.86 ఎకరాల విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమి ఉంది. రూ.కోట్ల విలువైన ఈ కొండ పొరంబోకును పలువురు ఆక్రమించుకుని చదును చేస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని శుక్రవారం సోషల్ మీడియాలో ప్రచారం చక్కర్లు కొట్టింది. స్పందించిన తహసీల్దారు అక్కడికి చేరుకుని ఆక్రమణలను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండ పొరంబోకును సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని ఆర్ఐ దినోజ్, వీఆర్ఓ నాగరాజును ఆదేశించారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



ఆక్రమణను పరిశీలిస్తున్న తహసీల్దారు, ఆర్ఐ

పర్యావరణ హితం.. చవితి సందేశం

- ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు గణేష్ ఉత్సవాలు
- మట్టి విగ్రహాలతోనే పర్యావరణానికి రక్షణ
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో కాలుష్యం
- సంప్రదాయాలను పాటించాలంటున్న నిపుణులు
- ప్రజల్లో పెరిగిన అవగాహన
- పెరిగిన మట్టి విగ్రహాల వినియోగం

వినాయక చవితి.. పర్యావరణ పరమైన పండుగ.. గణనాథుడి పూజలో వినియోగించే గరక, చెరకు గడ, జిల్లేడు పూలు, పత్రి, తుమ్మిపూలు, ఉత్తరేణి, అరటి ఆకులు, పూలు, పండ్లు.. ఇలా ప్రతి వస్తువు ప్రకృతి సిద్ధమైనదే. పూజకు పసుపుతో చేసిన లేదా మట్టితో చేసిన గణపతి విగ్రహాలను వినియోగించాలని శాస్త్రం చెబుతుంది. అయితే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నెలకొల్పుతుండటంతో పర్యావరణానికి హాని కలుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.




ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన మట్టి విగ్రహాలు

ఆదోనిఅర్బన్ : పండగలు, సంప్రదాయల పరిరక్షణలతో పాటు సామాజిక బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన తరుణమిది. కాలుష్యానికి కారణమయ్యే వాటిని పక్కనపెట్టి పర్యావరణ సహిత విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.ఏటా జరుపుకునే గణపతి ఉత్సవాలను పర్యావరణహితంగా జరుపుకోవాలన్న స్పృహ అందరిలోనే పెరిగింది. గ్రామాల్లో మట్టి గణపతుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతుండడంతో మట్టి విగ్రహాల తయారీదారులకు ప్రోత్సాహం లభిస్తోంది.

18నుంచి ఉత్సవాలు..

వినాయచవితి ఉత్సవాలు పట్టణంలో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతుండగా, 22న నిమజ్జనోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో గణనాథుల విగ్రహాల తయారీ, విక్రయాలు ఊపందుకున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను వినియోగించడం వల్ల వాతావరణం కలుషితమవుతోంది. దీంతో గత కొన్నేళ్లుగా మట్టి వినాయక విగ్రహాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. అధికార యంత్రాంగం సైతం మట్టి విగ్రహాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ క్రమంలో గతేడాది అనేక గ్రామాల్లో పలు స్వచ్ఛంద సేవాసంస్థల వారు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీచేసి వాటి ప్రాధాన్యతను చాటుతున్నారు. పట్టణంలో సోమవారం వినాయకచవితి పండగ సందర్భంగా ఆయా కాలనీల్లో గణేష్ మండప నిర్వాహకులు విగ్రహాలను ప్రతిష్ఠించి ఐదు రోజులపాటు పూజలు చేయనున్నారు. పట్టణంలో 500కు పైగానే విగ్రహాలు ప్రతిష్ఠించే అవకాశముందని గణేష్ కేంద్రకమిటీ సభ్యులు పేర్కొంటున్నారు.



మట్టితో చేసిన మహా గణపతి (ఫైల్)

మేము సైతం..

పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అంటూ విగ్రహాలను తయారు చేసి ప్రజలకు పంచి పెట్టి, వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు. పట్టణంలో ఆర్ఆర్‌జీ స్వచ్ఛందసేవా సంస్థ వ్యవస్థాపకుడు తిమ్మన్నగౌడ్ పదేళ్లుగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ఈ యేడాది కూడా వీరశైవ కళ్యాణ మండపంలో ఆదివారం పంపిణీ చేయనున్నారు. అలాగే తిరుమలనగర్‌లోని శ్రీ భారతీతీర్థ ఉద్యానవనం ఆధ్వర్యంలో రెండేళ్ల నుంచి మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నారు. ఏబీవీపీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐదేళ్ల నుంచి మట్టి గణపతులను అందజేస్తున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో హాని..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని వైద్యులు, ప్రముఖులు సూచిస్తున్నారు. నీటిలో నిమజ్జనం చేసినప్పుడు త్వరగా కరగకుండా నీటిని కాలుష్యం చేస్తుందని, ఆ నీటి ద్వారా పంటలు నాశనం కావడంతోపాటు జంతువులు, మనుషులు తాగితే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. అలాగే.. వివిధ రకాల చర్మ వ్యాధులు, వ్యాధులు ప్రబలుతాయని పేర్కొంటున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అనారోగ్యం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను కెమికల్‌తో తయారు చేస్తారు. దీంతో నీటిలో ఆలస్యంగా కరుగుతుంది. నీరు కాలుష్యం కావడం, ఆ నీటిని ప్రజలు తాగడం వల్ల అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఐదేళ్ల నుంచి తాము మట్టి విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ గోపీనాథ్, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు

తయారీదారులకు కూడా ఇబ్బందులే

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాలను తయారు చేసే వారు వివిధ రకాల వ్యాధుల బారిన పడతారు. నీటిలో నిమజ్జం చేసిన కారణంగా నీటి కాలుష్యంతో జంతువులు తాగి అనారోగ్యానికి గురవడంతో పాటు పంటలు కూడా నాశనమవుతాయి. మట్టి విగ్రహాల వల్ల ఎలాంటి హాని ఉండదు.

– డాక్టర్ కృష్ణమూర్తి